ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

12 జిల్లాలకు వర్షసూచన

ఈశాన్య రుతుపవనాల ప్రభావం, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గురువారం చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట, వేలూరు, తిరుపత్తూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురువనున్నాయి. ఈ నెల 18న రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లోనూ, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోనూ ఉరుములు, మెరుపులతో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, ఈరోడ్, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, కడలూరు, విల్లుపురం, వేలూరు జిల్లాల్లో, పుదుచ్చేరిలో కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురువనున్నాయి.

రాజధానిలో...

రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. సబర్బన్ ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. గురువారం ఉదయం వాయుగుండం తీరం దాటే సమయంలో నగరంలో కొన్ని ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ఆ సందర్భంగా గంటకు 35 నుంచి 45 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు. గ్రేటర్ చెన్నై అధికారులు యుద్ధ ప్రాతిపదికన వర్షబాధిత ప్రాంతాల్లో వాననీటిని తొలగించడంతో బుధవారం ఉదయం నగరంలోని ప్రధాన రహదారులు కొంతమేరకు చక్కబడ్డాయి.

రెడ్‌హిల్స్‌లో 28 సెం.మీ.ల వర్షం

బుధవారం ఉదయం 8.30 గంటలకు గడిచిన 24 గంటల వ్యవధిలో రెడ్‌హిల్స్ ప్రాంతంలో 28 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇదే విధంగా మనలిలో 23 సెం.మీ., ఆవడిలో 25 సెం.మీ, పెరంబూరు, కొళత్తూరులో 21 సెం.మీ, అన్నానగర్ వెస్ట్‌లో 19.2 సెం.మీ, పుళల్‌లో 17 సెం.మీ మాధవరంలో 15.8 సెం.మీ, ఐస్‌హౌస్‌లో 12.4 సెం.మీ వర్షం కురిసినట్లు అధికారులు లెక్కగట్టారు. తిరువళ్లూరు జిల్లాలో అత్యధికంగా గుమ్మిడి పూండిలో 95 సెం.మీ.లు, పొన్నేరిలో 90 సెం.మీలు, పూందమల్లిలో 85 సెం.మీలు చొప్పున వర్షపాతం నమోదైంది.


వ్యాసర్పాడి గణేశపురం సబ్ వేలో చేరిన వరద నీరు

గండం గడిచేనా?

నేడు తీరం దాటనున్న వాయుగుండం

- చెన్నై సహా 4 జిల్లాలకు రెడ్‌అలర్ట్
- గంటకు 40 నుంచి 60 కి.మీ.వేగంతో గాలులు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై, పరిసర జిల్లాల్లో బుధవారం వేకువజాము నుంచి వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు తేలికపాటి జల్లులే కురిశాయి. ఈ నాలుగు జిల్లాల్లో కుండపోతగా, భారీగా వర్షాలు కురుస్తాయని జారీ చేసిన రెడ్‌అలెర్ట్ ప్రకటనతో ఆందోళన చెందిన ప్రజలు బుధవారం ఉదయానికల్లా వాతావరణ కేంద్రం అధికారులు ఆ ప్రకటన వెనక్కి తీసుకోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం వేకువజామున నెల్లూరు - పుదుచ్చేరి మధ్య, చెన్నై సమీపంలో తీరం దాటనున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఈ మేరకు నగరంలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం సౌత్‌జోన్ ఛైర్మన్ ఎస్.బాలచంద్రన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తీవ్ర వాయుగుండం బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి చెన్నైకి 250 కి.మీల దూరంలో ఉందని, గురువారం వేకువజాము తీరం దాటే సమయంలో భారీగా, ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. చెన్నై సహా నాలుగు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించినంత మాత్రాన ఆ జిల్లాల్లో 20 సెం.మీ.లకు పైగా వర్షం కురుస్తుందని ప్రజలు అపోహపడకూడదని, కొన్ని చోట్ల మాత్రమే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ హెచ్చరిక చేశామని వివరించారు. చెన్నై, పరిసర జిల్లాల్లో కొన్ని చోట్ల భారీగా, మరి కొన్ని చోట్ల ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు. దక్షిణ మధ్య బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదలి సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నైరుతి బంగాళాఖాతంలో తీవ్రరూపం దాల్చింది. బుధవారం ఉదయం 8.30 గంటలకు చెన్నైకి తూర్పు - ఆగ్నేయంగా 320 కి.మీ.ల దూరంలో పుదుచ్చేరికి 350 కి.మీ.ల దూరంలో నెల్లూరుకు ఆగ్నేయంగా సుమారు 400కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమైంది. బుధవారం మధ్యాహ్నం గంట కు 12 కి.మీ.ల వేగంతో తీరం వైపు కదులుతున్నట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ తీవ్ర అల్పపీడనం దక్షిణ ఆంధ్రప్రదేశ్ వైపు మళ్ళడంతో గత రెండు రోజులుగా చెన్నై సహా నాలుగు జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలు మంగళవారం రాత్రి నుండి క్రమంగా తగ్గుముఖంపట్టాయి. అల్పపీడనం కారణంగా చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాలకు ప్రకటించిన రెడ్ అలెర్ట్ బుధవారం మధ్యాహ్నానికల్లా ఉపసంహరించుకున్నారు. గురువారం వేకువజాము ఈ తీవ్ర అల్పపీడనం పుదుచ్చేరి - నెల్లూరు మధ్య చెన్నైకి చేరువగా తీరం దాటనుంది. దీని కారణంగా జాలర్లు ఈ నెల 18 వరకు చేపలవేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 40 నుండి 60 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని గురువారం వేకువజాము మరింత పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

సాయం ముమ్మరం..

గత రెండు రోజులుగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో 300 ప్రాంతాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల నుంచితరలించిన 200 మందికి ఆశ్రయం కల్పించినట్లు కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నగరంలో సగటున 131 మి.మీ వర్షం కురిసిందని, దాని కారణంగా పలు ప్రాంతాల్లో కూలిన 67 చెట్లను వెంటనే తొలగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశం ప్రకారం నగరంలో 388 అమ్మా క్యాంటీన్‌లలో ఉచితంగా మూడు పూటల అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు.


ఓ ఇంటిలోని గదిలో పేరుకుపోయిన ఇసుక


వళ్లవిలైలో ఓ ఇంటి ప్రాంగణంలో ప్రవేశించిన సముద్రజలాలు

కుమరిలో 'అల'జడి

- ఇళ్లలోకి చొరబడిన సముద్ర జలాలు



చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో మంగళవారం రాత్రి సముద్ర తీర ప్రాంతాల్లో రాక్షస అలలు ఎగసిపడ్డాయి. పది నుండి 15 అడుగుల ఎత్తున అలలు దూసుకురావటంతో తీర ప్రాంతాల్లోని నివాసాల్లో సముద్రపు నీరు వరదలా ప్రవేశించింది. పలువురు తమ ఇళ్లలోకి సముద్రపు నీరు రాకుండా ఇసుక బస్తాలు పేర్చి రాత్రంతా జాగారం చేశారు. రాజమంగళం సమీపం ఆళిక్కాల్, పిళ్లైతోప్పు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం వేకువజాము వరకు అలలు జనావాస ప్రాంతాల వైపు ఎగసిపడ్డాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 150కి పైగా ఇళ్లలోకి సముద్ర జలాలు చొరబడ్డాయి. దీంతో ఆ ఇళ్లలో నివసిస్తున్నవారిని రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలువురు తమ ఇళ్ల మిద్దెలపై పడుకున్నారు. జాలర్ల కుప్పాలలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇదే విధంగా తేంగాయ్‌పట్టినం, ఇరవిబుధన్ తురై, వళ్లవిలై, పూత్తురై, తూత్తురై ప్రాంతాల్లోనూ అలలు 15 అడుగుల ఎత్తున ఎగసిపడ్డాయి. ఆ ప్రాంతాల్లోని ఇళ్లన్నీ కోతకు గురయ్యాయి. అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో బుధవారం ఉదయం కన్నియాకుమారి త్రివేణి సంగమం, ముట్టమ్ ప్రాంతాలకు పర్యాటకులను అనుమతించకుండా అధికారులు నిషేధం విధించారు. ఇదే విధంగా జాలర్లు రెండు రోజులపాటు చేపల వేటకు వెళ్లొద్దని కూడా ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టాలపై పడిన రాయిని తొలగిస్తున్న సిబ్బంది



ఊటీ రైలు పట్టాలపై మట్టిచరియలు, బండరాళ్లు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కున్నూరు - ఊటీ మధ్య పలు చోట్ల రైలు పట్టాలపై మట్టి చరియలు, బండరాళ్లు పడటంతో కొండ రైలు సర్వీసును తాత్కాలికంగా రద్దు చేశారు. నీలగిరి జిల్లా కున్నూరు పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా మేట్టుపాళయం నుంచి కున్నూరు దాకా నడిపే కొండ రైలు సర్వీసును బుధ, గురువారాలు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అదే సమయంలో కున్నూరు - ఊటీ మధ్య కొండ రైలు నడుపుతామన్నారు. అయితే మంగళవారం రాత్రి కురిసిన కుండ పోత వర్షాలకు ఆ మార్గంలోని మూడు చోట్ల పట్టాలపై మట్టి చరియలు, బండరాళ్లు కూలిపడ్డాయి. దీంతో కున్నూరు నుంచి ఊటీ వెళ్లే కొండరైలు సర్వీసును రద్దు చేశారు. ప్రస్తుతం ఆ మార్గంలో పట్టాలపై పడిన మట్టి చరియలు, బండరాళ్లను రైల్వే సిబ్బంది తొలగిస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయిన తరువాత కొండ రైలు నడుపుతామని అధికారులు ప్రకటించారు.

తాత్కాలిక జలపాతాలు..

ఊటీ పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కొండ రైలు మార్గంలోని పలు ప్రాంతాల్లో తాత్కాలిక జలపాతాలు ఏర్పడ్డాయి. ఉడ్‌బ్రిడ్జి, పర్లియారు, కేఎన్‌ఆర్ హిల్‌గ్రోవ్, అటర్లీ తదితర ప్రాంతాల్లో కొండపై పలు చోట్ల నీరు ఉధృతంగా పట్టాలపై పడుతోంది. అదే సమయంలో ఆ నీటి ఉధృతికి మట్టిపెళ్లలు జారి పట్టాలపై పడుతున్నాయి. ప్రస్తుతం ఈ జలపాతాల వలన కొండ రైలు మార్గం తీవ్రంగా దెబ్బతింటుందేమోనని రైల్వే అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇక పెనుగాలులతో కూడిన వర్షాల కారణంగా వండిచోలై, పొలాడి మఠం, బాయిస్ కంపెనీ, మూంద్రురోడ్డు తదితర ప్రాంతాల్లో చెట్లు కూల్డాయి. అగ్నిమాపక అధికారి కుమార్, తహసీల్దార్ కని సుందరం పర్యవేక్షణలో కార్మికులు ఆ చెట్లను తొలగిస్తున్నారు. బుధవారం ఉదయం కున్నూరు సమీపంలోని బ్లాక్‌బ్రిడ్జి - సప్లయిడిపో రహదారిలో మూడు చెట్లు విద్యుత్ తీగెలపై పడ్డాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే ఆ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.


కొండ రైలు మార్గం పక్కన జలపాతాలు


గిండి రేస్‌క్లబ్ ప్రదేశంలో చెరువు తవ్వకం పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

దక్షిణ చెన్నైలో సీఎం పర్యటన

- చెరువులు, వాగులను పరిశీలించిన స్టాలిన్
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావం, బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా నగరంలో భారీగా వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్నారు. మంగళవారం ఉత్తర చెన్నైలోని బేసిన్ బ్రిడ్జి, ఎలిఫెంట్ గేట్ తదితర ప్రాంతాల్లో పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం దక్షిణ చెన్నైలోని గిండి రేస్‌క్లబ్, వేళచ్చేరి ప్రాంతాన్ని ఆయన అధికారులతోపాటు పరిశీలన జరిపారు. తొలుతగా ఇటీవల ప్రభుత్వ పరమైన గిండి రేస్‌క్లబ్ ప్రాంతంలోని మూడు చెరువుల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులు, కొత్తగా చేపట్టిన చెరువు నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఆ తర్వాత వేళచ్చేరి ప్రాంతంలోని వీరాంగాళ్ వాగు వద్ద ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పూడిక తీత పనులను కూడా సీఎం పరిశీలించారు. ఆ తర్వాత నారాయణపురం చెరువు వద్ద గట్లను పటిష్ఠం చేసే పనులను కూడా ఆయన తనిఖీ చేశారు. స్టాలిన్‌తో పాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు అరవింద్ రమేష్, హసన్ మౌలానా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.అముద, నగరపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, చెన్నై నీటి సరఫరా మురుగునీటి తొలగింపు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ టీజీ వినయ్ తదితర అధికారులు పర్యటించారు.

వాననీటి తక్షణ తొలగింపే మీకు శ్వేతపత్రం

- ఈపీఎస్‌కు ఉదయనిధి కౌంటర్

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాన నీటి నిరోధక పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రధాన ప్రతిపక్షనేత నేత మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కోరడం విడ్డూరంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన అన్ని ప్రాంతాల్లో వాననీటిని కొద్ది గంటల్లోనే తొలగించడమే ప్రభుత్వ శ్వేతపత్రంగా భావించవచ్చని వ్యాఖ్యానించారు. గురువారం ఉదయం చేపాక్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నగరంలో వర్షబాధిత ప్రాంతాల్లో సేవలందించిన పారిశుధ్య కార్మికులందరికీ అల్పాహార ప్యాకెట్లు, బిస్కెట్లు, రొట్టెలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీ దయానిధి మారన్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఎన్.సిట్రరసు, జోనల్ కమిటీ ఛైర్మన్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలమేరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సమష్టిగా వర్షబాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరంగా చేపడుతున్నారని, నగరంలో ఎంతటి భారీగా వర్షాలు కురిసినా గంటలోపే వర్షపునీటిని భారీ మోటార్ల ద్వారా తొలగించారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతుంటే వాననీటి నిరోధక పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈపీఎస్ డిమాండ్ చేయడం గర్హనీయమన్నారు. ఇప్పటి దాకా ప్రధాన ప్రతిపక్షనాయకుడిగా ఆయన వర్షబాధిత ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించలేదన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని విమర్శించారు.


చేపాక్‌లో పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధిమారన్

రేషన్‌షాపుల్లో ఉచితంగా బియ్యం, చక్కెర

● పుదుచ్చేరి సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని రేషన్‌షాపుల్లోఈ నెల 21 నుంచి దీపావళి సందర్భంగా బియ్యం, చక్కెర ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 21న రేషన్ షాపులను తెరుస్తామని, రేషన్‌షాపు ఉద్యోగులకు వేతనాలు ఇచ్చేందుకు కూడా చర్యలు చేపట్టామని తెలిపారు.

నేటినుంచి యథావిధిగా మెట్రోరైళ్లు

వేళచ్చేరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు సేవలు గురువారం నుంచి యథావిధిగా సాగుతాయని చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి.

● ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రీన్ లైన్‌లో పురచ్చితలైవర్ డా.ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ మెట్రో నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 6 నిముషాలకు ఒక రైలు నడువనుంది.

● బ్లూ మార్గంలో వింకో నగర్ మెట్రో నుంచి విమానాశ్రయం వరకు 6 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నారు.

● బ్లూ మార్గంలో వాషర్‌మెన్‌పేట మెట్రో నుంచి అరింజర్ ఆలందూర్ మెట్రో మధ్య 3 నిమిషాలకు ఒక రైలు నడువనుంది.

● తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8 గంటలు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బ్లూ, గ్రీన్ మార్గాల్లో 7 నిమిషాలకు ఒక రైలు నడువనుంది.

● రాత్రి 10 నుంచి 11 గంటల వరకు బ్లూ, గ్రీన్ మార్గాల్లో 15 నిమిషాలకు ఒక రైలు నడువనుంది.

ఎనిమిది విమానాల రద్దు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి బుధవారం పలు నగరాలకు వెళ్లాల్సిన ఎనిమిది విమానాలు రద్దయ్యాయి. బుధవారం వెళ్లేందుకు టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు వర్షాల కారణంగా తమ ప్రయాణాలను విరమించుకున్నారు. దీంతో, తగినంత మంది ప్రయాణికులులేని కారణంగా చెన్నై-మదురై-చెన్నై ఇండిగో ఎయిర్‌లైన్స్, చెన్నై-సేలం-చెన్నై ఇండిగో ఎయిర్‌లైన్స్, చెన్నై-షిర్డీ-చెన్నై స్పైస్ జెట్, చెన్నై-సేలం-చెన్నై వి మానాలు రద్దు చేశారు. అదే సమయంలో విమానాలు బయల్దేరే సమయం మారడంతో దానికి తగినట్లుగా ప్రయాణించవచ్చని ఆయా విమాన సంస్థలు తెలిపాయి.

రేపటి నుంచి ఊటీలో 'బుక్ ఎగ్జిబిషన్'

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో ఉన్న గిరిజన సాంస్కృతిక కేంద్రంలో ఈ నెల 18 నుంచి 27వ తేది వరకు '3వ నీలగిరి పుస్తక ప్రదర్శన-2024' జరుగనుంది. ఈ ఎగ్జిబిషన్‌లో దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ముద్రణా సంస్థలు, ప్రభుత్వ శాఖల తరఫున 60 స్టాల్స్ ఏర్పాటుకానున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు పుస్తక పఠన సామర్థ్యం పెంపొందించేలా కార్యక్రమాలు ఏర్పాటుచేయనున్నట్లు, ప్రజలు ఉచితంగా ఈ ఎగ్జిబిషన్ సందర్శించవచ్చని జిల్లా కలెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది.

తమిళనాడుకు నీటిని విడుదల చేయండి

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు నెలవారీ కేటాయించే నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి కావేరి నీటి నిర్వహణ కమిటీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీ సమావేశం మంగళవారం 'వీడియో కాన్ఫరెన్స్' ద్వారా నిర్వహించగా, రాష్ట్రం తరఫున కావేరి టెక్నాలజీ డివిజన్ విభాగం అధ్యక్షుడు సుబ్రమణ్యం, తిరుచ్చి మండల నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ దయాళ్‌కుమార్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు తమిళనాడుకు నెలవారీ కేటాయించాల్సిన నీటిని విడుదల చేయాలని కమిటీ అధ్యక్షుడు కర్ణాటక ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీ తదుపరి సమావేశం ఈ నెల 29వ తేది జరుగనుంది.

తగ్గిన కూరగాయల ధరలు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా కోయంబేడు మార్కెట్లో మంగళవారం టమోటా కిలో రూ.120కి విక్రయం కాగా బుధవారం రూ.50కి పడిపోయింది. ఉల్లి కిలో రూ.60, బంగాళాదుంపలు రూ.45, ఊటీ క్యారట్ రూ.50, కర్ణాటక క్యారెట్ రూ.30కి విక్రయించారు. బీన్స్ కిలో రూ.160, కర్ణాటక బీట్‌రూట్ రూ.30, ఊటీ బీట్‌రూట్ రూ.65, మునగ రూ.60, అల్లం రూ.170, వెల్లుల్లి రూ.350, కొబ్బరి రూ.80కి అమ్మినట్లు వ్యాపారులు తెలిపారు.

తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండంతో విద్యుత్ వినియోగం తగ్గింది. రాష్ట్రంలో రోజువారీ సరాసరి విద్యుత్ వినియోగం 16,000 మెగావాట్లుంటుండగా, వేసవి కాలంలో 19,000 పైగా ఉంటోంది. ప్రతి ఏటా సెప్టెంబరులో వర్షాల కారణంగా విద్యుత్ వినియోగం తగ్గుతోంది. అల్పపీడనం కారణంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించగా, ఐటీ సంస్థలు ఉద్యోగులకు 'వర్క్ టు హోం' ప్రకటించాయి. దీంతో, రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 2,000 మెగావాట్లు తగ్గి 14,000 మెగావాట్లు ఉంది.

డెల్టా జిల్లాల్లో
ఆగని వర్షం


స్థానిక మెరీనా తీరంలో నిలిపిన పడవలు

● మూడు రోజులుగా ఇళ్లకే పరిమితమైన జాలర్లు

● ఆగిన నౌకా రవాణా

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో మూడోరోజు బుధవారం కూడా జనజీవనం స్తంభించింది. ఈ జిల్లాలకు చెందిన సుమారు 22 వేల మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. నాగపట్టణం, కారైక్కాల్ ఓడరేవుల్లో 1వ నెంబరు తుఫాను సూచికను ఎగురవేశారు. ఇక నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంకలోని గాంగేశన్ మధ్య నడుపుతున్న నౌకా రవాణా సేవలను గురువారం వరకు రద్దు చేసినట్లు నౌకా సంస్థ డైరెక్టర్ నిరంజన్ తెలిపారు. మైలాడుదురై, పెరంబలూరు, అరియలూరు, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు జిల్లాల్లో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. మోస్తరు వర్షాల కారణంగా తిరుచ్చి జిల్లా లాల్గుడి సమీపంలోని సెంబరై నుంచి పుల్లంబాడి వెళ్లే రహదారిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అందువల్ల ఆ మార్గంలో వాహన రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేశారు. ఇదిలా ఉండగా, డెల్టా జిల్లాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వేలాది ఎకరాల రబి వరి పంట నీటమునిగింది. నాగపట్టణం జిల్లాలో మూడు రోజులుగా 10,000 మందికి పైగా జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు. సుమారు 2,800 మర బోట్లు, ఫైబర్ బోట్లు, నాటు పడవలు తీరంలోనే నిలిచిపోయాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గురువారం తెల్లవారుజామున ఉత్తర తమిళనాడు-పశ్చిమ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటుతుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. అందువల్ల నాగపట్టణం, కారైక్కాల్ హార్బర్లలో తుఫాను సూచికను ఎగురవేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హెచ్.రాజా

అనుభవం లేని ఉదయనిధికి
ఉప ముఖ్యమంత్రి పదవి

● బీజేపీ నేత హెచ్.రాజా విమర్శ

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుభవం లేని ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని బీజేపీ రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా ఎద్దేవా చేశారు. నీలగిరి జిల్లా ఊటీ లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్.రాజా మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, రాష్ట్ర ప్రభు త్వం వర్షపు కాలువల నిర్మాణం చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం రూ.4,000 కోట్లు కేటాయించిందన్నారు. అందులో 90 శాతం నిధులు ఖర్చుచేసినట్లు పేర్కొన్న నేపథ్యంలో, ప్రస్తుతం 40 శాతం మాత్రమే ఖర్చుచేసినట్లు ప్రభుత్వం తెలుపుతుందన్నారు. పనులు చేపట్టి ఏడాది దాటినా రాజధాని నగరం చెన్నై మళ్లీ వరదలు సంభవించాయన్నారు. కవరపేట రైలు ప్రమాదం మానవ తప్పిదమా, సిగ్నల్ లోపమా, సంఘ విద్రోహుల పనా అనే విషయంపై విచారణ సాగుతోందన్నారు. కానీ, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, రైలు ప్రమాదాలను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమందని ఆరోపిస్తున్నారని, ఒక విషయం మాట్లాడే ముందు, దానిపై అవగాహన కల్పించుకొని మాట్లాడాల్సి ఉందన్నారు. కానీ, ఎలాంటి అనుభవం లేని ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారన్నారు.

తీరప్రాంత జిల్లాలకు తలా 12 వేల లీటర్ల కిరోసిన్

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంటగ్యాస్ సిలిండర్ కనెక్షన్ లేని, ఒక సిలిండర్ కనెక్షన్ మాత్రమే ఉన్న రేషన్ కార్డుదారులకు రేషన్ దుకాణాల ద్వారా కిరోసిన్ అందజేస్తున్నారు. లీటరు కిరోసిన్ రూ.15కు విక్రయిస్తుండగా, కార్డుల సంఖ్యను బట్టి కేంద్ర ప్రభుత్వం కిరోసిన్ కేటాయిస్తోంది. ప్రస్తుతం ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాల సీజన్ జనవరి వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో, తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు సహా 15 తీర ప్రాంత జిల్లాలకు తలా 12,000 లీటర్ల కిరోసిన్ కేటాయించినట్లు, త్వరలో రేషన్ దుకాణాలకు తరలించి వినియోగదారులకు అందించనున్నట్లు ఆహార శాఖ తెలిపింది.

ప్రజల్లో భక్తి తగ్గడమే హఠాత్ వర్షాలకు కారణం...!

● మదురై ఆధీనం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తి తగ్గడమే హఠాత్ వర్షాలకు కారణమని మదురై ఆధీనం తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబొమ్మన్న 225వ వర్థంతి సందర్భంగా బుధవారం మదురై పెరియార్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి మదురై ఆధీనం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువతకు తెలియజేసేలా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మదురై ఆధీనం తరఫున స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించే కార్యక్రమాలు చేపట్టామని, వారు లేకుంటే మనం లేమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని కోరారు. రాష్ట్రంలో హఠాత్తుగా కురుస్తున్న వర్షాలకు యువతలో భక్తి తగ్గిపోవడమే కారణమని మదురై ఆధీనం తెలిపారు.

దీపావళికి ముందే రేషన్ కందిపప్పు

● వానతి శ్రీనివాసన్ డిమాండ్

వేళచ్చేరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళికి ముందే రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయాలని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో ఆరు నెలలుగా కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, గత మూడు నెలల నుంచి పూర్తిగా ఇవ్వడం లేదన్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.200లకు విక్రయమవుతుండగా, రేషన్ దుకాణాల్లో రూ.30కి ఇస్తుండడం వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీపావళి సందర్భంగా ముందుగానే రాష్ట్రంలోని 1.80 కోట్ల రేషన్‌కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని వానతి శ్రీనివాసన్ డిమాండ్ చేశారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో సిటీ బస్సులకు అనుమతి



ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం సిటీ బస్సు సదుపాయం కల్పించింది. వర్షాలను కారణంగా టాక్సీలు అదనంగా ఛార్జీలు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు ప్రయాణికులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన సర్కారు మంగళవారం రాత్రి నుంచి ఎంటీసీ బస్సులను త్రిశూలం ప్రాంతంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల ప్రాంగణం నుంచే ప్రయాణికులను ఎక్కించుకొని పలు ప్రాంతాలకు తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

విద్యుత్ బోర్డు కార్యాలయం తనిఖీ


అధికారులకు సూచనలిస్తున్న మంత్రి సెంథిల్ బాలాజి

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా రాజధాని నగరంలోని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లను ఆ శాఖ మంత్రి సెంథిల్ బాలాజి బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ కార్యాలయ ప్రాంగణంలో వరద బాధిత ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు 65 మంది ఉద్యోగులు షిఫ్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. విద్యుత్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ నందకుమార్ తదితర ఉన్నతాధికారులతో కలసి పరిశీలించిన మంత్రి సెంథిల్ బాలాజి, వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సేవలు, ఫిర్యాదులకు సంబంధించి 24 గంటలు పనిచేసే '9498794987' టోల్ ఫ్రీ నెంబరును ప్రజలు ఉపయోగించాలని మంత్రి సూచించారు.

అమ్మ క్యాంటీన్లలో ఉచిత భోజనం

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా గ్రేటర్ చెన్నైలోని అమ్మ క్యాంటీన్లలో ఉచిత భోజనం పంపిణీ బుధవారం ప్రారంభమైంది. గురువారం వరకు వరద ప్రభావిత ప్రాంతాల వాసులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం అతిభారీ వర్షాల కారణంగా నగరంలో రహదారుల్లో నిలిచిన నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించే పనులు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, మందులు తదితరాలను జీసీసీ అధికారులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, నగరంలో నివసిస్తున్న పేదలు, ఫుట్‌పాత్ వాసులు, ఆటో డ్రైవర్లు, రిక్షావాలా, భవన నిర్మాణ కార్మికులు తదితరుల ఆకలి తీర్చేలా అమ్మ క్యాంటీన్లలో రెండు రోజులు ఉచిత భోజనం పంపిణీ సదుపాయం కల్పించారు.

25లోగా పబ్లిక్ పరీక్షల విద్యార్థుల వివరాలు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం టెన్త్, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల వివరాలు ఈ నెల 25వ తేది లోగా నమోదుచేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల శాఖ డైరెక్టర్ లత జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన ఉత్తర్వులో... ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు ఈ నెల 15వ తేదిలోగా పంపించాలని ఆదేశించారు. కానీ, విద్యార్థుల వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు కలుగుతున్నాయని,ఈగడువు పొడిగించాలని హెచ్ఎంలు పరీక్షల శాఖను అభ్యర్థించారని, వారి విజ్ఞప్తి మేరకు విద్యార్థుల వివరాల నమోదు ఈ నెల 25వ తేది వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ డైరెక్టర్ లత పేర్కొన్నారు.

'కలసి ప్రయాణం చేద్దాం'

● కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు స్టాలిన్ అభినందనలు

వేళచ్చేరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణం చేసిన ఒమర్ అబ్దుల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా పదవీ ప్రమాణానికి హాజరుకావాలని తనకు ఆహ్వానం అందింది. కానీ, రాష్ట్రంలో నెలకొన్న భారీవర్షాల కారణంగా సహాయక చర్యలు పర్యవేక్షించాల్సి ఉన్నందున తాను కార్యక్రమానికి హాజరుకాలేకపోయాను. కానీ, డీఎంకే తరఫున పార్టీ ఎంపీ కనిమొళిని పంపించాము. దేశంలో దక్షిణాదిన తమిళనాడు, ఉత్తరాన జమ్ము కశ్మీర్ రాష్ట్రాల హక్కుల సాధన కోసం ప్రజాస్వామిక పోరాటంలో కలసి ప్రయాణిద్దాం...గెలుద్దాం అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ తన శుభాకాంక్షల్లో పేర్కొన్నారు.

నేటినుంచి సోత్తుపారై, మంజలారు నుంచి సాగునీరు విడుదల

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా సోత్తుపారై జలాశయం నుంచి సాగు నీటిని విడుదల చేయాలని ప్రభు త్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారం నుంచి 60 రోజుల వరకు సెకనుకు 30 ఘనపుటడుగులు, తదుపరి 31 రోజులు 27 ఘనపుటడుగులు, చివరగా 59 రోజులు 25 ఘనపుటడుగుల నీరు విడుదల చేయనుండగా, దీంతో జిల్లాలో 2,865 ఎకరాల్లో సాగు జరుగుతుంది. అలాగే, మంజలారు జలాశయం నుంచి గురువారం నుంచి 150 రోజులు నీరు విడుదల చేయాలని ప్రభు త్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మహిళల భద్రత కోరుతూ 'శారీ వాకథాన్'


శారీ వాకథాన్‌లో విద్యార్థినులు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి పరిరక్షణ, మహిళల భద్రతపై 'శారీ వాకథాన్' పేరుట కోయంబత్తూర్ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోవై ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మహిళల అభివృద్ధి విభాగం, పలు సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ వాక్‌థాన్‌ను పుదుచ్చేరి మాజీ పోలీసు అధికారి బాలకృష్ణన్ ప్రారంభించారు. కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ అవినాశిలింగం వర్సిటీ వరకు సాగింది. ఈ ర్యాలీలో విద్యార్థినులు నీటి సంరక్షణ, మహిళల భద్రతతో కూడిన ప్ల కార్డులతో పాల్గొన్నారు.

16 లక్షల లీటర్ల ఆవిన్ పాల విక్రయాలు


అశోక్‌నగర్‌లోని ఆవిన్ షోరూమ్ తనిఖీ చేస్తున్న మంత్రి రాజకన్నప్పన్

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో మంగళవారం 16 లక్షల లీటర్ల పాలు విక్రయించినట్లు ఆవిన్ సంస్థ తెలియజేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సోమవారం రాత్రి నుంచి నగరంలో భారీవర్షం కురవగా, మంగళ, బుధవారాల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. వర్షాల కారణంగా ప్రజలు మూడు రోజులకు అవసరమైన పాలు, తాగునీరు, నిత్యావసర సరుకులు నిల్వ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలు సరఫరా చేయాలనే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో పశుసంవర్ధక శాఖ మంత్రి రాజకన్నప్పన్ ఆవిన్ పాల కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. సాధారణంగా నగరంలో ప్రతిరోజు 14.5 లక్షల లీటర్ల పాలు విక్రయమవుతుండగా, మంగళవారం అదనంగా రూ.1.5 లక్షల లీటర్లు అని మొత్తం 16 లక్షల లీటర్ల పాలు విక్రయించినట్లు ఆవిన్ సంస్థ తెలియజేసింది.

నేడు బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధ పీఠాధిపతి దివంగత బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం జరుగనుంది. ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ బంగారు అడిగళార్ పర్యవేక్షణలో బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ, కలశ పూజ, సాయంత్రం 5 గంటలకు మొదటి జాము పూజలు జరుగనున్నాయి. శుక్రవారం రెండు, మూడో జాము పూజలు, శనివారం ఉదయం కుంభాభిషేకం, అడిగళార్ విగ్రహానికి అభిషేకాలు జరుగనున్నాయి. కరూర్, రామనాథపురం, శివగంగ, పుదుకోట జిల్లాలకు చెందిన అడిగళార్ భక్తులు వేడుకల ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు.

బాణసంచా దుకాణాల టెండర్లపై హైకోర్టు స్టే

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియపై మద్రాసు హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. చెన్నై బాణసంచా ఏజెంట్ల సంక్షేమ సంఘం తరఫున హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... చెన్నై బాణసంచా ఏజెంట్ల సంక్షేమ సంఘం టెండర్‌ను నిరాకరించిన రాష్ట్ర ప్రభుత్వం, అర్హత లేని చెన్నై బాణసంచా వ్యాపారుల సంక్షేమ సంఘం టెండర్‌ను స్వీకరించిందని, అందుకు స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి ఎం.దండపాణి విచారించగా పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది... ఎలాంటి ప్రకటన లేకుండా ఈ టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. అందుకు న్యాయమూర్తి స్పందిస్తూ... రాష్ట్ర ప్రభుత్వమే బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేయొచ్చు కదా, మూడో వ్యక్తి నుంచి ఎందుకు టెండర్లు ఆహ్వానించి టపాసుల దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారని ప్రశ్నించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున... ప్రతి ఏడాది ఇదే విధానం పాటిస్తున్నామని తెలియజేసింది. ఈ వాదనలు విన్న న్యాయమూర్తి, ఐల్యాండ్ గ్రౌండ్‌లో బాణాసంచా ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియకు తాత్కాలిక స్టే విధిస్తూ, తదుపరి విచారణ వాయిదావేశారు.

మాదకద్రవ్యాలు విక్రయించిన మెడికల్ షాపుకు సీలు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదురైలో మాదకద్రవ్యాలు విక్రయించిన మెడికల్ షాపుకు ఆరోగ్య శాఖ అధికారులు సీలు వేసి షాపు యజమాని అబ్దుల్ రెహ్మాన్‌ను అరెస్టు చేశారు. మదురై పోలీస్ కమిషనర్ లోకనాధన్ ఉత్తర్వుల మేరకు మాదకద్రవ్యాల నివారణ విభాగం అధికారులు మంగళవారం పలు ప్రాంతాల్లో నిఘా వేశారు. సెల్లూర్ ప్రాంతంలోని వీఏఓ కార్యాలయం సమీపంలోని మెడికల్ షాపులో తనిఖీ చేసి 40 మత్తు బిళ్లలు, మత్తు ఇంజక్షన్లు తదితరాలు స్వాధీనం చేసుకొని దుకాణానికి సీలు వేశారు. యజమాని రెహ్మాన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

విద్యుదాఘాతానికి లెదర్ కంపెనీ యజమాని బలి

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని పెరియమేడులో విద్యుదాఘాతానికి లెదర్ కంపెనీ యజమాని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పెరియమేడు ఈకే గురు వీధిలో బిహార్‌కు చెందిన అహ్మద్ సయ్యద్ (43) తమ కుటుంబంతో నివసిస్తూ, సాట్ బాక్స్ అనే పేరుతో లెదర్ కంపెనీ నడుపుతున్నాడు. మంగళవారం సాయంత్రం తమ ఇంటి వంట గదిలో స్విచ్ వేసేందుకు యత్నించిన అహ్మద్ సయ్యద్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలతో స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులు ఆయనను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అశ్లీల వీడియోపై నటి ఓవియా ఫిర్యాదు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కలవాణి చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమైన నటి ఓవియా తనకు సంబంధించిన అశ్లీల వీడియో విడుదల చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఓ బాయ్‌ఫ్రెండ్ నటి ఓవియా కలిసి అసభ్యంగా ఉన్న వీడియో ఒకటి ఎక్స్‌పేజీలో వెలువడి కలకలం సృష్టించింది. ఆ వీడియో చూసిన నెటిజన్లు ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. వాటికి ఆమె సమాధానం చెప్పకుండా 'ఎంజాయ్ బ్రో' అని పేర్కొని, ఆ వీడియో లింక్ తనకు పంపమంటూ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ అశ్లీల వీడియోపై ఆమె ఉన్నట్టుండి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● పోక్సో చట్టం కింద టీచర్ అరెస్టు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ టీచర్‌ను (50) పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమ కుమార్తె పట్ల టీచర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు సెంజి మహిళా పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా ఆయనను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

లంచం కేసులో సర్పంచ్ అరెస్టు

వేళచ్చేరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్త ఇంటి నిర్మాణం అనుమతులకు లంచం అడిగిన పంచాయతి అధ్యక్షురాలిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శివగంగ జిల్లా కాళయార్‌కోయిల్ గ్రామానికి చెందిన కాళీశ్వరన్ తన కొత్త ఇంటి నిర్మాణం కోసం పంచాయతి సర్పంచ్ జోస్పిన్ మేరీ అనుమతి కోరాడు. అందుకు రూ.5 వేలు లంచం కోరడంతో, కాళీశ్వరన్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచనలతో సర్పంచ్‌కు కాళీశ్వరన్ లంచం ఇస్తుండగా అధికారులు ఆమెను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో సర్పంచ్‌కు సహకరించిన అరుల్‌రాజ్, అతని సహాయకుడిని కూడా అధికారులు అరెస్టు చేశారు.

పీఎంఆర్‌హెచ్‌ఎస్‌కు రూ.209 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రధాన మంత్రి గ్రామీణ గృహనిర్మాణ పథకం (పీఎంఆర్‌హెచ్ఎస్) పథకంలో 68,569 ఇళ్ల నిర్మాణానికి తొలివిడతగా రూ.209.20 కోట్లు కేటాయించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. కానీ, ప్రస్తుతం ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 62 శాతం నిధులు అందజేస్తోంది. ఈ పథకంలో ఒక ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.11 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.72 లక్షలు మొత్తం రూ.2.83 లక్షలు ఇస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో రూ.836.82 కోట్లతో 68,569 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిన కేంద్రం, తొలివిడతగా కేంద్ర ప్రభుత్వం రూ.125.22 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.83.68 కోట్లు అని మొత్తం రూ.209.20 కోట్లు కేటాయించారు.

19 చోట్ల అన్నాడీఎంకే సహాయక బృందాలు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో నగరంలో వర్ష బాధితులకు సహాయక చర్యలు కోసం 19 ప్రాంతాలలో 'రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్' పేరిట ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. కొళత్తూరు, విల్లివాక్కం, హార్బర్, ఎగ్మూరు, చేపాక్, ట్రిప్లికేన్,. థౌజెండ్‌లైట్స్, మైలాపూరు, వేళచ్చేరి, చోళింగనల్లూరు, ఆలందూరు, పెరంబూరు, ఆర్కేనగర్, రాయపురం, తిరువికనగర్, టి.నగర్, అన్నానగర్, విరుగంబాక్కం, సైదాపేట ప్రాంతాల్లో తలా ఐదుగురు సభ్యులతో ఈ సహాయ బృందాలు వర్షబాధితులను ఆదుకునే పనులు చేపడతాయన్నారు.

నీటమునిగిన పైరు


దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతులు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. కులమంగళం, సమయన్‌కుడిక్కాడు ప్రాంతాల మీదుగా వెళ్లే కన్నన్ నది కాలువ పిచ్చి చెట్లు, గుర్రపు డెక్కతో పూడుకుపోయింది. దీంతో, వర్షపు నీరు సమీపంలోని పొలాల్లో చేరింది. దీంతో, సుమారు వెయ్యికి పైగా ఎకరాలు చెరువును తలపిస్తున్నాయి. రబీ సాగులో 20 రోజుల క్రితం వేసిన వరినాట్లు నీటమునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ముందే సాగు పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నా, మేట్టూరు జలాశయం నుంచి విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టుకు చేరుకోలేదని, అందుకే నాట్లు జాప్యమయింది. ప్రస్తుతం ఎన్నో శ్రమ, వ్యయప్రయాలకు ఓర్చి సాగు చేసిన పంట నీటమునిగిందని రైతులు వాపోతున్నారు.

చదురగిరిలో భక్తులు లేకుండా ప్రదోష పూజలు



ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ కనుమల కొండల్లోని చదురగిరి సుందర మహాలింగం ఆలయంలో భక్తులు లేకుండా ప్రదోష పూజలను ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చదురగిరి కొండపై వెలసిన సుందర మహాలింగ స్వామివారిని ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో దర్శనం చేసుకొనేందుకు భక్తులను అడవి మార్గంలో అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో రెండు రోజులుగా భారీవర్షాల కారణంగా అక్కడున్న వాగులన్నీ పొంగాయి. అందువల్ల భక్తులను ప్రదోష పూజలకు అనుమతించలేదు. దీంతో పూజారులే ప్రదోష పూజలను నిర్వహించారు.

ఇంకా నీటిలోనే ...

● 103 ప్రాంతాల్లో వరద నీటి తొలగింపు పనులు


పటాలం అంతా నీరే


ఒట్టేరి కాలువ

ప్యారీస్, అక్టోబరు 16: ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీవర్షాలకు రాజధాని నగరం చెన్నై ఇంకా నీటిలోనే నానుతోంది. రెండు రోజుల వర్షానికి నగరంలో 539 ప్రాంతాల్లో వరద నీరు నిలువగా, ఇందులో 436 ప్రాంతాల్లో జీసీసీ సిబ్బంది తొలగించారు. మరో 103 ప్రాంతాల్లో 900 మోటార్ల ద్వారా వరద నీటి తొలగింపు పనులు వేగవంతం చేశారు. భారీవర్షంతో స్తంభించిన జనజీవనం బుధవారం వర్షం కురవకపోవడంతో యధాస్థితికి చేరుకుంది. మంగళవారం రాత్రి నుంచి నగరంలో పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు మాత్రమే పడ్డాయి. కీల్పాక్కం అళగప్ప రోడ్డు, నాయర్ జంక్షన్, పురుషవాక్కం కెథడ్రల్ రోడ్డు, మిల్లర్స్ రోడ్డు, కున్నూరు హైవే, శివగామి రోడ్డు, చూలై మేడు పెరియార్ పాధై, టి.నగర్ పనగల్ పార్క్, వాణిమహల్ జంక్షన్, మేట్టుపాళయం కాలియమ్మన్ ఆలయ వీధి, ఓఎంఆర్ రోడ్డు, ఎస్పార్పీ టూల్స్, ఎంజీఆర్ రోడ్డు, కందన్‌చావిడి తదితర ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌వేలలో చేరిన వర్షపు నీటిని తొలగిస్తున్న నేపథ్యంలో, సీబీ రోడ్డు, గణేశ్‌పురం, రంగరాజపురం, ఎమ్మార్టీఎస్ సబ్ వేలలో బుధవారం కార్పొరేషన్ సిబ్బంది నీటిని తొలగిస్తున్నారు. వరద ముంపు గురైన పటాలం ఆంజనేయ స్వామి వీధి, చూలై, పెరియ మేడు, షోలింగనల్లూర్ తదితర ప్రాంతాల్లో సహాయ పనులను కూడా వేగవంతం చేశారు. మైలాపూర్ శివస్వామి రోడ్డు నుంచి రాయపేట హైరోడ్డు వరకు చెరువును తలపించేలా వరద నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు పాట్లు పడుతున్నారు. అదే విధంగా మైలాపూర్ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో కూడా చేరిన వరద నీటిని తొలగిస్తున్నారు. ఇక, అన్నానగర్ 6వ అవెన్యూ, అమింజికర్రై రజాక్ గారెన్, తిరుమంగళం మెయిన్ రోడ్డు, అన్నా ఆర్చి తదితర ప్రాంతాల్లో వరద నీటిని పూర్తిగా తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో చేరిన వరద నీటిని మోటార్ల ద్వారా తొలగిస్తున్నారు. విరుగంబాక్కం కాళియమ్మన్ ఆలయం, రోహిణి థియేటర్ సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు. విల్లివాక్కం, కొరట్టూరు, అంబత్తూర్, ఓటేరి, అయనావరం, ఐసిఎఫ్, సిడ్కో నగర్ ప్రాంతాల్లో రెండడుగుల మేర నీరు నిలిచింది. కొరట్టూరు హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న ప్రజలు వరద నీటితో మురుగునీరు కలవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో, వరద ముంపు ప్రాంతాలకు చెందిన ప్రజలను కార్పొరేషన్ అధికారులు కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 300 ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో ఇంకా సహాయ చర్యలు చేపట్టని కారణం వల్ల ఆ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ ఇళ్లు ఖాళీచేసి బంధువులు, స్నేహితుల ఇళ్లకు పయనమవుతున్నారు.


సబ్‌వేలో చేరిన నీటిలో తోపుడు బండ్ల వ్యాపారుల ఇక్కట్లు


బాధితులను ఫైబర్ పడవలో తరలిస్తున్న దృశ్యం


కోయంబేడు మార్కెట్లో నీటిపాలైన పండ్లు


వరద బాధిత ప్రాంతాల్లో వైద్య పరీక్షలు చేస్తున్న మాజీ గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్


నీటిలో తంటాలు పడుతున్న వృద్ధుడు


మనలిలో నిలిచిన నీరు


మోకాలు లోతు నీటిలో ప్రజల అగచాట్లు


పెరంబూర్ రైల్వేస్టేషన్ రోడ్డులో వరద ప్రవాహం


ద్విచక్ర వాహన చోదకుల ఇబ్బందులు


పటాలంలో వరద నీటిలో బైక్




కొరట్టూరులో ఎక్స్‌కవేటర్ బక్కెట్‌లో ప్రజల తరలింపు


చూలై అంకాళమ్మ ఆలయ ప్రాంతంలో చేరిన నీరు


గణేశపురం సబ్‌వే ఫుట్‌పాత్‌పై వాహన చోదకుల అవస్థలు

వరద బాధితులకు డ్రోన్లతో ఆహారపదార్థాల పంపిణీ


రిప్పన్ భవనం వద్ద డ్రోన్ పనితీరును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నగర పాలక శాఖమంత్రి కేఎన్ నెహ్రూ

● పనితీరుపై మంత్రి పరిశీలన

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షబాధిత, వరద బాధిత ప్రాంతాల్లో పడవలు కూడా వెళ్ళలేని పరిస్థితుల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహార పదార్థాలను అందించేందుకు జీసీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు రిప్పన్‌భవనం వద్ద బుధవారం ఉదయం డ్రోన్‌ల పనితీరును నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ పరిశీలించారు. వర్షాలు, తుఫాన్ల కారణంగా పడవలు సైతం వెళ్లలేని ప్రాంతాల్లో జలదిగ్బంధంలో చిక్కుకునేవారికి, పాలు రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లను డ్రోన్‌ల ద్వారా అందించాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. దీనికోసం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ గరుడా, కొథారీ, ట్రాకో అనేమూడు డ్రోన్‌లను సిద్ధం చేసింది. వాటి ద్వారా 5 నుంచి 10 కిలోల వరకు నిత్యావసర వస్తువులను 40 మీటర్ల ఎత్తున 2 కి.మీ. దూరంలో ఉన్నవారికి అందించవచ్చునని అధికారులు చెప్పారు. మంత్రి నెహ్రూ సమక్షంలో అధికారులు డ్రోన్ల పనితీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జె.కుమార గురుబరన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి టొయొబో ఆర్వో మెంబ్రేన్‌లు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి శుద్ధీకరణలో రివర్స్ ఆస్మోసిస్ (ఆర్వో) టెక్నాలజీలో పేరుగడించిన టొయొబో ఎంసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్పైరల్ వూండ్ ఆర్వో మెంబ్రేన్‌లను చెన్నై మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కొత్త రకం మెంబ్రేన్‌లను చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.శంకర్ ప్రారంభించారు. సెయింట్ గోబైన్ ఇండియా మాజీ ఎండీ ఇ.స్వామినాథన్, హెచ్ఈసీఎస్ సీఈఓ డాక్టర్ జేఆర్ మోసెస్, టొయొబో ఎంసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కోజి సుజినో తదితరులు పాల్గొన్నారు.


కొత్త ఆర్వో మెంబ్రేన్ ఆవిష్కరణలో పాల్గొన్న సీపీసీఎల్ ఎండీ హెచ్.శంకర్ తదితరులు



ఫ్యాషన్ షోలో మోడళ్లు

అలరించిన ఫ్యాషన్ షో

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో వున్న ఫీనిక్స్ మార్కెట్ సిటీలో పల్లాడియం ఆధ్వర్యంలో జరిగిన ఫ్యాషన్ షో ఆహూతులను విశేషంగా అలరించింది. ది కలెక్టివ్, హ్యాకెట్, డూన్ లండన్, టూమీ, షాపర్ స్టాప్, ఫరెవర్ 21, అమెరికన్ ఈగల్ వంటి మాల్‌ల నుంచి వివిధ లగ్జరీ బ్రాండ్లతో వింటర్ కలెక్షన్లతో పలువురు మోడళ్లు ఫ్యాషన్ వాక్ చేశారు. కాలానుగుణమైన ఉత్తమ, అత్యాధునిక కలెక్షన్లతో ఆకర్షణీయమైన మోడళ్లు తమ ప్రతిభ చాటారు. ప్రేక్షకులను ఆకట్టుకునేలా సరికొత్త దుస్తులతో ర్యాంప్‌ను అలరించారు. అంతర్జాతీయ ఫ్యాషన్ కొరియోగ్రాఫర్ సమీర్‌ఖాన్ తదితరులు ఈ ర్యాంప్‌లో పాల్గొన్నారు.

నావికా దళానికి కొత్త నౌక

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతమైన కాట్టుపల్లి షిప్ యార్డులో 'మల్టీ పర్పస్ షిప్' విధానంలో పనిచేసే కొత్త నౌకను భారత నౌకాదళం పరిచయం చేసింది. భారత నావికాదళానికి పలు రకాల నౌకలు తయారుచేసేందుకు, సైనిక మంత్రిత్వ శాఖ, ఎల్ అండ్ టీ సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం తయారుచేసిన 'ఐఎన్ఎస్ సమర్థక్' కొత్త నౌక పరిచయం కాట్టుపల్లిలో మంగళవారం జరిగింది. భారత నావికాదళ చీఫ్ కమాండర్ దినేష్ కె.త్రిపాఠి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ఆయన సతీమణి, నావల్ వైఫ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శశి త్రిపాఠి కొత్త నౌకా సేవలు ప్రారంభించారు. ఈ నౌక వివిధ విభాగాల ప్లాట్‌ఫారాలపై ఖచ్చితమైన ఆపరేషన్ కోసం రూపొందించారు. భూమి, గగనతల లక్ష్యాలు, తీరప్రాంత నిఘా, రెస్క్యూ, పెట్రోలింగ్ నిర్వహించేలా రూపొందించినట్లు అధికారులు తెలిపారు.


కొత్తగా తయారుచేసిన 'ఐఎన్ఎస్ సమర్థక్'

చిత్రజ్యోతి


'గగన మార్గన్'లో విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోని కొత్త చిత్రం 'గగన మార్గన్'

'రోమియో' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత విజయ్ ఆంటోనీ నటించే చిత్రానికి 'గగన మార్గన్' అనే టైటిల్ ఖరారు చేశారు. మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకుడు. ఇందులో విజయ్ ఆంటోనీ హై పోలీస్ ఆఫీసర్‌గా డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో కాకుండా సరికొత్త కోణంలో లైవ్ డిటెక్టివ్ తరహాలో స్టోరీ ప్లాన్ చేశారు. తమిళ సంప్రదాయం ప్రతిబింబించేలా, వైవిధ్య భరితమమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో పరిశోధనాత్మక స్క్రీన్‌ప్లేతో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం విజయ్ ఆంటోనీ. ఇతరపాత్రల్లో అజయ్ దీషన్, సముద్రఖని, మహానది శంకర్, బ్రిగడ, వినోద్ సాగర్, దీప్షిక, కనిమొళి తదితరులు నటించారు.

జనవరిలో కార్తి 'వా వాత్తియార్' రిలీజ్?


'వా వాత్తియార్'లో కార్తి

హీరో కార్తీ నటిస్తున్న కొత్త చిత్రం 'వా వాత్తియార్'ను వచ్చే యేడాది జనవరిలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల 'మెయ్యళగన్' విడుదలై విజయం సాధించింది. ఈ సినిమా తర్వాత నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తీ కొత్త చిత్రం తెరకెక్కుతుంది. సీనియర్ నటుడు రాజ్ కిరణ్ తాతగా, సత్యరాజ్ విలన్ పాత్రల్లో కనిపించనున్నారు. హీరోయిన్‌గా కృతిశెట్టి నటించగా, ఆనంద్ రాజ్ మరో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఆయన ఈ చిత్రం విడుదలపై స్పందిస్తూ, జనవరి నెలలో విడుదల చేసేందుకు ప్లాన్ చేశామని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆలరించే స్క్రిప్టుతో రూపొందిస్తున్నట్టు తెలిపారు.

'వీర ధీర సూరన్-2'లో దుషార విజయన్, చియాన్ విక్రమ్


'వీర ధీర సూరన్'లో విక్రమ్, దుషార విజయన్

చియాన్ విక్రమ్ నటిస్తున్న 62వ చిత్రం 'వీర ధీర సూరన్-2'లో హీరోయిన్ దుషార విజయన్ ఒక ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఆమె పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ సినిమాలో దుషార పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా ఎస్‌జే సూర్య, సూరజ్, సిద్ధిఖ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. శిబు థమిన్స్ నిర్మించే ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. కాగా, దుషార... తమిళ చిత్రసీమకు 'సర్పట్టా పరంబరై' చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమై ఆ తర్వాత అరుళ్‌నిధి 'కళువేత్తి మూర్ఖన్', ధనుష్ 'రాయన్', రజనీకాంత్ 'వేట్టయన్' తదితర చిత్రాల్లో మంచి ఎమోషనల్, నటనకు ప్రాధాన్యత ఉండే పాత్రల్లో నటించి ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకున్నారు.



వార్డుల్లోనూ గొడుగు పట్టాల్సిందే

తిరుపతి రుయాస్పత్రి బయటే కాదు.. లోపలా వర్షానికి రోగులు ఇబ్బంది పడ్డారు. పలు వార్డుల్లోని భవనాలు శిథిలదశలో ఉండటంతో వర్షానికి వాటిల్లో నుంచి నీరు కారి నేలంతా తడిసి ముద్దయింది. రోగులు, వారి సహాయకులూ తడిచారు. వార్డుల్లో నుంచి వచ్చే క్రమంలోనూ, పరీక్షలకోసం బయటకు వెళ్లేటప్పుడు.. ఆస్పత్రికి వెళ్లే సమయంలో వానకు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా ఓపీ, ఎంఎం, ఎఫ్ఎస్, వార్డుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

రెక్కే..ఇంతుంటే!

ఓజిలి సమీపంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు దగ్గర జాతీయ రహదారి మీద నిలబడివున్న ఈ రైలంత లారీని దారిన పోయేవాళ్లంతా ఆగి మరీ చూశారు. ఏ రాకెట్టునో లారీ మోసుకుపోతోందేమో అని కళ్లింత చేసుకున్నారు. తీరా ఆరా తీస్తే.. అది విండ్‌మిల్‌లో ఉండే ఒక రెక్క మాత్రమే. రెక్కే ఇంతుంటే కరెంటును పుట్టించే ఆ గాలిఫ్యాను ఇంకెంత ఉంటుందో అని విస్తుపోయారు.

- ఓజిలి, ఆంధ్రజ్యోతి





కొండూరుపాళెం వద్ద సముద్ర ముఖద్వారాలు

సముద్ర ముఖద్వారంలో పేరుకుపోతున్న మేట

పులికాట్‌లో తగ్గిపోతున్న నీటిమట్టం

తరిగిపోతున్న మత్స్య సంపద

పూడిక తీయక ఉపాధి కోల్పోతున్న జాలర్లు

పాలకుల నిర్లక్ష్యం మత్స్యకారులపాలిట శాపంగా మారింది. సముద్ర ముఖద్వారంలో మేట వేసిన పూడికను తీయకపోవడం వల్ల వేలాది మంది ఉపాధికి ముప్పు వాటిల్లింది.

సముద్ర ఘోష

వాకాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండూరుపాళెం, పూడిరాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద లోతు కనీసం 10 నుంచి 15 అడుగులు ఉండాలి. ప్రస్తుం 5 అడుగుల లోతు మాత్రమే ఉంది. ఇందువల్ల పడవలు సముద్రంలోకి వెళ్లేందుకు వీలు కావడం లేదు. ఇక్కడ పడవలు చిక్కుకుపోతున్నాయి. పడవలు సముద్రంలోకి వెళ్లకపోతే చేపలవేట సాధ్యం కాదు. కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల నుంచి బకింగ్‌హాం కెనాల్‌లో మూడు కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తే సముద్ర ముఖద్వారం వస్తుంది. మార్చి నెల నుంచి సెప్టెంబరు, అక్టోబరు దాకా ముఖద్వారం వద్ద ఇసుకమేట వేస్తుంటుంది. ఎక్కడ ఎంత లోతు, మెరక ఉందో అంచనా వేయడం కష్టం. దీంతో మేట వేసిన ప్రాంతాల్లో మరపడవలు చిక్కుకుపోయి దెబ్బతింటున్నాయి. నాయకులకు, అధికార్లకు ఈ సమస్య గురించి మత్స్యకార్లు చెప్పుకుంటూనే ఉన్నారు. జగన్ ప్రభుత్వంలో సాగరమాల అంటూ హడావుడి చేసి మాయ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది గనుక ఇప్పుడైనా పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద హార్బర్ ఏర్పాటుచేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఈ ప్రతిపాదన ఏమైంది?

రాయదొరువు వద్ద ముఖద్వారాలు లోతు తీయాలని కేంద్ర జల సంఘం నిపుణుల కమిటీ 2015లోనే సిఫారసు చేసింది. ఇందుకు రూ.48 కోట్లు ఖర్చు అవుతుందని కూడా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

జగన్ మాయ

సాగరమాల ద్వారా 160 కోట్లతో పూడిరాయదొరువు వద్ద హార్బర్ ఏర్పాటు చేసేందుకు మరొక ప్రతిపాదన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ హైలెవల్ కమిటీ, జాతీయ తీరప్రాంత పరిశోధన సంస్థ, ఎండోమర్ కోస్టల్ హైడ్రాలిక్ డైరెక్టర్లు ఈమేరకు నివేదికలు తయారు చేశారు. పూడిరాయదొరువు వద్ద సముద్రంలోకి 2 కిలోమీటర్లు పొడవు, 400 మీటర్లు వెడల్పు, 12 అడుగుల లోతు ఉండేలా గోడలను నిర్మించాలని సూచించారు. ఇందువల్ల పెద్ద ఓడలను కూడా నిలుపుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. 2022లో జగన్ ప్రభుత్వం పెద్ద హడావుడే చేసింది. పనులు ప్రారంభిస్తున్నామంటూ ప్రకటించారు. అంగుళమైనా ముందుకు తీసుకువెళ్లలేదు. జాలర్ల ఓట్ల కోసం ఆర్భాటపు ప్రకటనలు చేసి చేతులెత్తేశారు.

- **పులికాట్ విస్తీర్ణం:** ఆంధ్రప్రదేశ్‌లో 400కి.మీ., తమిళనాడులో 61కి.మీ.
- వాకాడు, చిల్లకూరు, కోట, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఉన్న మర పడవల సంఖ్య: 362.
- చేపల వేట ఉపాధిగా గల కుటుంబాలు: 60వేలు.

తమిళ జాలర్లతో గొడవలు

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ఉన్న పులికాట్ సరస్సులో మనవైపు సముద్ర ముఖద్వారాలకే ఈ సమస్య అంతా. ముఖద్వారాలు పూడిపోవడంతో పులికాట్ సరస్సులో నీటి మట్టం కూడా తగ్గిపోతోంది. మత్స్య సంపద వృద్ధి కాదు. ఇదే తమిళనాడు పరిధిలోని ముఖద్వారాలు తెరుచుకొని ఉన్నాయి. ఎప్పటికప్పుడు తమిళనాడు ప్రభుత్వం పూడిక తీత పనులు చేపడుతూ ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో నీరు పుష్కలంగా ఉంటుంది. ఇందువల్ల తమిళ జాలర్లు ఏడాది పొడవునా వేట సాగిస్తున్నారు. ఆంధ్ర పరిధిలోనే సరస్సు అధికభాగం ఉన్నా మన జాలర్లకు ఉపాధి కరువవుతోంది. పూడిరాయదొరువు, కొండూరుపాళెం ప్రాంతాల వద్ద లోతు తక్కువగా ఉండటంతో వేట సమయంలో ఆంధ్ర జాలర్లను తమిళ జాలర్లు అడ్డుకుంటూ ఉన్నారు. ఇందువల్ల తరచూ ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి.



తిరుమల ఘాట్‌లో విరిగి పడిన కొండచరియలు



తిరుమల ఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద పడిన కొండచరియలు

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాల నేపథ్యంలో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్ రోడ్డులోని మూడుప్రదేశాల్లో బుధవారం కొండచరియలు విరిగిపడ్డాయి. వర్షపు నీటిలో బాగా నానిపోయిన కొండచరియలు 15వ కిలోమీటరు, హరిణి ప్రాంతం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో పడ్డాయి. అయితే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వీటిని ఎక్స్‌కవేటరు, ట్రక్కులు, ట్రాక్టర్ల సహాయంతో వేగంగా తొలగించారు. పైగా రోడ్డుకు పక్కభాగాల్లోనే పడటంతో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మరికొన్ని ప్రదేశాల్లోనూ కొండచరియలు విరిగిపడే అవకాశాలున్నట్టు గుర్తించిన అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. అక్కడ కూడా కొండచరయిలు విరిగిపడే వెంటనే స్పందించి తొలగించేలా అప్రమత్తంగా ఉన్నారు. ఇక, జీఎన్సీ, అలిపిరి వద్ద వాహనదారులను భద్రతాసిబ్బంది అప్రమత్తం చేసి ఘాట్‌రోడ్డులోకి అనుమతిస్తున్నారు. ఇక, తిరుమలలో బుధవారం విడతలవారీగా కురిసిన వర్షంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దర్శనానికి వెళ్లే సమయంలోను.. దర్శనం పూర్తి చేసుకుని ఆలయం వెలుపలకు వచ్చాక తడుస్తూనే వెళ్లారు. కొందరు గొడుగుల్లో, మరికొందరు తమ వద్దనున్న వస్త్రాలు కప్పుకుని వెళ్లారు. చలి కూడా పెరిగింది. భారీ వర్షాల నేపథ్యంలో పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను టీటీడీ మూసివేసింది. బుధవారం ఉదయానికి తిరుమలలోని ఐదు డ్యాముల్లో 250 లక్షల గ్యాలన్ల నీరు చేరింది.

నేడు శ్రీవారిమెట్టు మార్గం మూసివేత

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు నడిచివచ్చే మార్గాల్లో ఒకటైన శ్రీవారిమెట్టు మార్గాన్ని టీటీడీ గురువారం మూసివేయనుంది. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈనిర్ణయం తీసుకుంది. వర్షాలు అధికంగా కురిసిన నేపథ్యంలో ఆమార్గంలో వరదనీరు అధికంగా ప్రవహిస్తుంది. ఈక్రమంలో టీటీడీ గురువారం ఒక్కరోజు తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయం తీసుకుంది.

కొండ చరియలపై ప్రత్యేక నిఘా

ఘాట్ రోడ్లలోని కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. విపత్తుల నిర్వహణ ప్రణాళికలపై చర్చించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తగా జనరేటర్ల కోసం డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, సీవీఎస్వో శ్రీధర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



గొడుగుల్లో వెళుతున్న భక్తులు

శ్రీవారిసేవలో పన్నీరుసెల్వం

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీరు సెల్వం బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజ స్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అదే విధంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కూడా ఓపీఎస్ బుధవారం దర్శించుకున్నారు.



తిరుమల శ్రీవారి ఆలయం ముందు పన్నీరు సెల్వం



సేలంలో పెరియార్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.



గిండి గాంధీమండపం ప్రాంగణం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబొమ్మన 225వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, మేయర్ ఆర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు

ఆవడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అగచాట్లు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం కురిసిన భారీవర్షాలతో బేసిన్ బ్రిడ్జి-వ్యాసర్పాడి మధ్య రైలు పట్టాలపై నీరు చేరడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్లో మార్పులు చేపట్టారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లాల్సిన చేరన్ ఎక్స్‌ప్రెస్, నీలగిరి ఎక్స్‌ప్రెస్, పాలక్కాడు ఎక్స్‌ప్రెస్, ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆవడి రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరుతాయని ప్రకటించారు. దీంతో, ఆయా రైళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికులు సెంట్రల్ నుంచి సబర్బన్ రైళ్లు, బస్సులు, ఆటోలు పట్టుకొని ఆవడి చేరుకున్నారు. తొలుత రాత్రి 9 గంటలకు రైళ్లు బయల్దేరతాయని ప్రకటించిన అధికారులు, అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు బయల్దేరతాయని ప్రకటించారు. ఆవడి రైల్వేస్టేషన్ చిన్నది కావడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వెళ్లాల్సిన సుమారు 2,000 మందికి పైగా అక్కడకు చేరడంతో రద్దీ నెలకొంది. రాత్రి సమయంలో చుట్టుపక్కల దుకాణాలు, హోటళ్లు లేకపోవడంతో ఆహారం లభించక ప్రయాణికులు అల్లాడిపోయారు. అదే సమయంలో, వర్షం కురుస్తుండడం ఫ్లాట్ ఫారాలు చిన్నవి కావడంతో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. కాగా, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా రైళ్లు నడిపినట్లు అధికారులు పేర్కొంటున్నారు.





ఫ్లాట్‌ఫారంపై వేచి ఉన్న ప్రయాణికులు - మెట్లపై ప్రయాణికులు

బురదమయమైన టీవీకే మహానాడు ప్రాంగణం

ప్యారీస్, అక్టోబరు 16: తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు నిర్వహించనున్న విక్రవాండి ప్రాంగణం బురదమయం అయింది. ఆగకుండా కురుస్తున్న వర్షాలకు వేదిక, పందిరి నిర్మాణం పనులు స్తంభించాయి. అందువల్ల మళ్లీ మహానాడు జరిగే తేది వాయిదాపడే అవకాశముందని ఆ పార్టీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ సినీనటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే మహానాడు ఈ నెల 27న విల్లుపురం జిల్లా విక్రవాండి వి.సాలైలో ఎంపిక చేసిన ప్రాంతంలో నిర్వహించనున్నారు. మహానాడు పనులు గత వారం రోజులుగా ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు మహానాడు ప్రాంగణంలో వాననీరు చేరింది. కార్యకర్తల కూర్చునేందుకు ఎంపిక చేసిన ప్రాంతం బురదమయమైంది. దీంతో, ఈ నెల 27న మహానాడు జరుగుతుందా, లేదా అంటూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో తర్జనభర్జనలు నెలకొన్నాయి.



వేదిక ప్రాంగణంలో నీరు చేరిన దృశ్యం

బస్సులో ప్రయాణించాలంటే గొడుగు తప్పనిసరి...!

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించాలంటే గొడుగు తప్పనిసరి అని ప్రయాణికులు పేర్కొంటున్నారు. వాయుగుండం కారణంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. అత్యవసర పనులకు మాత్రమే బయటకు వెళుతున్న ప్రజలు, గొడుగులు బట్టుకొని వెళ్తున్నారు. కానీ, ప్రభుత్వ రవాణా సంస్థ, ఎంటీసీ బస్సులు పై కప్పు ఊడిపోవడం, కిటికీ అద్దాలు లేకపోవడంతో వర్షం కురిసే సమయంలో బస్సు పైకప్పు నుంచి నీరు పడి ప్రయాణికులు తడిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో, ధర్మపురి జిల్లా పెరియాంపట్టి నుంచి పాలకోటికి బయల్దేరిన బస్సులో విద్యార్థులు, ప్రజలు ప్రయాణించారు. ఆ సమయంలో హఠాత్తుగా కురిసిన వర్షానికి బస్సు పైకప్పు నుంచి నీరు కారుతుండడంతో బస్సులోని వారు గొడుగులు వేసుకొని ప్రయాణించారు. దెబ్బతిన్న బస్సులకు మరమ్మతులు చేపట్టడం, వాటి స్థానంలో కొత్త బస్సులు వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గొడుగులతో ప్రయాణికులు

